# రాముం నన్ను క్షమించాడు


—స్నేహా

ట్రైన్ వేగంగా సాగిపోతోంది. కిటికీ ప్రక్కన సీటులో కూర్చుని పరుగులు తీస్తున్న ప్రకృతి అందాలను చూస్తూంటే మనస్సు పులకించిపోతోంది. నిజం, ప్రకృతిలో ఇన్ని అందాలు ఉన్నాయా? జీవితంలో ఎన్నోసార్లు రైలు ప్రయాణం చేశాను. కానీ, వాటిని నేను ఎప్పుడూ గుర్తించలేదు.

ఇప్పుడు తలచుకుంటే, నేను ఇన్ని సంవత్సరాలూ మనిషిలా కాక, ఒక రాయిలా బ్రతికానని పిస్తోంది. జీవితాన్ని జీవించడం కూడా ఒక కళే అన్న సత్యాన్ని అరవై ఆరు సంవత్సరాలు గడిపిన తరువాత తెలుసుకోవడం నిజంగా ఒక వేదైన అనుభవం. కానీ, ఎప్పటికీ తెలుసుకోలేక పోవటం కన్నా, ఎప్పుడో ఒకప్పుడు తెలుసుకోవడం నయం కదా (బెటర్ లేట్ దేన్ నెవర్).

పచ్చని పొలాలు పిల్ల గాలి తాకిడికి లయబద్ధంగా తల లూపుతుంటే, మనస్సులో ఆనంద తరంగాలు ఎగసి పడుతున్నాయి. గేదెలను కాస్తున్న పిల్లలు రైల్లో వాళ్ళకు చిరునవ్వుతో టాటాలు చెపుతుంటే, నాకు అత్యంత ఆప్తులు, సన్నిహితులైన వాళ్ళు వీడ్కోలు చెపుతున్నట్లనిపిస్తోంది. మధ్య మధ్యలో కన్పిస్తున్న పిల్ల కాలువలు. చెట్ల మీద నుండి, చెట్ల మీదకు ఎగురుతూ పలుకరించే పాల పిట్టలు, గంభీరంగా నిలబడి, పరీక్షగా చూస్తున్నట్లున్న కొండలు, కేరింతలు కొడుతున్నట్లున్న చెట్లు, ప్రకృతిలోని ప్రతి అణువూ మనోహరంగా కన్పిస్తోంది. ఆఖరికి, ట్రాక్ ప్రక్కనున్న టెలిఫోన్ తీగలు, క్రిందకు వస్తూ, పైకి పోతూన్నట్లు కన్పిస్తూ వీణా నాదాన్ని వింటున్న అనుభూతిని కల్గిస్తున్నాయి. ఇన్ని సంవత్సరాలు ఎంత వ్యర్థంగా గడిచిపోయాయి! రైలు ప్రయాణం చేస్తూంటే ఎప్పుడూ కిటికీ ప్రక్కన కూర్చునే వాణ్ణే కాదు, దుమ్మూ, ధూళీ వస్తుందని ప్రయాణ కాలమంతా వ్యర్థమయిపోతుందని తెగ బాధ పడి పోయేవాణ్ణి. ప్రయాణ సమయంలో ఏదో ఆఫీసు ఫైల్ తెచ్చుకుని, ఆ పని చేస్తూ, సమయాన్ని సద్వినియోగం చేస్తున్నాననుకునే వాణ్ణి. కానీ ఇంతకాలం నేనేం కోల్పోయానో ఇప్పుడు అర్థం అవుతోంది. కేవలం ఆఫీసు పని మీద శ్రద్ధతో అలా చేసే వాణ్ణా? లేక గొప్ప ఆఫీసరుగా అందరిలో గుర్తింపు పొందాలని అలా ప్రవర్తించేవాణ్ణా? రెండవ విషయంలోనే నాకు ఎక్కువ శ్రద్ధ. పై పై మెరుగుల కోసం, పదుగురి మెప్పు కోసం జీవితంలో చాలా పోగొట్టుకున్నాను. ముఖ్యంగా ఇరవై మూడు సంవత్సరాలు రాముం ఆప్యాయతనూ, ప్రేమనూ కోల్పోయాను. రాముం నా ఒక్కగానొక్క కొడుకు. వాడి దగ్గరకే ఇప్పటి నా ఈ ప్రయాణం. వాడికి నేను చేసిన ద్రోహానికి వాడు నన్ను క్షమిస్తాడా? నేను చేసిన తప్పు అంత చిన్న తప్పా; ఒకటా, రెండా, ఇరవై మూడు సంవత్సరాలు, వాడిని ఎంత క్షోభకు గురి చేశాను! వెనక్కు పరుగులు తీస్తున్న చెట్లు, చేలతో పాటు నా ఆలోచనలు గతంలోకి సాగిపోతాయి.

రామున్ని చిన్నప్పటి నుండి ఎంతో క్రమ శిక్షణలో పెంచాను. మొక్కై వంగనిది మానై వంగుతుందా? అనే ఉద్దేశ్యంతో వాడిని ప్రతి చిన్న తప్పుకూ కఠినంగా శిక్షించే వాడిని. కాదు, రాముం కూడా నా మాటకు ఎదురు చెప్పే వాడు కాదు. ఇంటర్మీడియెట్‌లో వాడికి సైన్స్ గ్రూప్ వుండేది. వాడికి పెద్ద డాక్టరు అవ్వాలన్న అభిలాష. కానీ, నేను చెప్పగానే వాడు కామర్స్ గ్రూప్‌లో జాయినయ్యాడు. డిగ్రీ అయిన తరువాత, నేను చెప్పిన విధంగా బిజినెస్ ఎడ్మినిస్ట్రేషన్ చేశాడు. చివరకు వాడు ఉద్యోగం విషయంలో కూడా నా నిర్ణయాన్నే తన నిర్ణయంగా అనుసరించాడు. మొట్టమొదటిసారి వాడు నాకు ఎదురు చెప్పింది వాడి పెళ్ళి విషయంలోనే. రాముం ఒక కులం తక్కువ అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయి వాడితో పాటు చదువుకుంది. మంచి అందగత్తె కూడా. నిజానికి వాడు ఆ అమ్మాయిని పెళ్ళి



చేసుకోవటం కంటే, ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకోవడం నాకు ఎక్కువ కోపం తెప్పించింది జీవితంలో మొట్టమొదటిసారి.

రాముం విషయంలో నా అహం దెబ్బ తింది. చిన్నప్పటి నుండి వాడిని పెంచి, పోషించి, పెద్ద చేస్తే వాడు నా ముందు తల ఎత్తుకు నిలబడి 'ఫలానా అమ్మాయిని పెళ్ళి చేసుకుంటా'ననడం సహించలేకపోయాను. వాడి మాట పూర్తి కాకముందే నా కోపం లేదని తెగేసి చెప్పాను. కానీ, రాముం ఒక పరిపూర్ణమయిన వ్యక్తిగా తయారయ్యాడన్న విషయమే విస్మరించాను. వాడు ఒక కులం తక్కువ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటానన్నాడు. ఇది నా హోదాకూ నా పేరు ప్రతిష్ఠలకూ ఎంత మచ్చగా మిగిలిపోతుంది! స్నేహితుల దగ్గరా, చుట్టాల దగ్గరా, ఆఫీసులోనూ నేను తల ఎత్తుకు ఎలా తిరగగలను? ,వాళ్ళు అనే మాటలు ఎలా భరించగలను? నిజంగా నాకు కులమంటే అంత పట్టింపు లేదు. సంప్రదాయాలు, ఆచారాల మీద గౌరవం లేదు. అవేమి రాముం కంటే ఎక్కువ కాదు. కానీ, ఆ మాట పైకి చెప్తే లోకం వాళ్ళు నన్ను చిన్న చూపు చూడరూ? ససేమిరా కాదన్నాను. ఇప్పుడు తలచుకుంటే ఎంత సిగ్గనిపిస్తుంది! నేను నా ప్రేమ కంటే, నా మమకారం కంటే, ఇతరుల వద్ద పడాల్సిన మొహమాటానికి ఎక్కువ ప్రాధాన్యత నిచ్చాను. రామున్ని బెదిరించాను. బాధించాను, బ్రతిమాలాను. కానీ రాముం తను పట్టిన పట్టు విడువ లేదు. చివరకు నా ఇంట్లో నుండి వెళ్ళగొట్టేస్తానన్నాను. అయినా రాముం నిలబడ్డాడు. 'ఆ పిల్లను పెళ్ళి చేసుకుంటే నువ్వు చచ్చావనుకుంటాన'న్నాను. రాముం ఆ అమ్మాయిని గుళ్ళో పెళ్ళి చేసుకున్నాడు. నా భార్యను ఆ ఛాయలకు కూడా వెళ్ళకుండా నిర్బంధించాను.

కోడలితో వాడు మొదటిసారి ఇంటికి వస్తే వీధి వీధంతా రచ్చ చేశాను. నన్ను వారించబోయిన నా భార్య చెంప పగల గొట్టాను. వాడికీ, నాకూ మధ్య ఏం సంబంధం లేదు. పొమ్మన్నాను. ఎందుకు చేశాను ఇదంతా? నా కోసమా? కాదు. నా చుట్టూ వున్న జనం కోసం. ఫలానా ఆయన ప్రతిష్ఠ కోసం తన కొడుకుని వదులుకున్నాడన్న పేరు కోసం .'మన కులంలో పుట్టిన ఆణిముత్యం' అని తన వాళ్ళందరూ అనుకోవటం కోసం. కేవలం రాముందే తప్పు. నాది ఏ తప్పు లేదు అని అందరిలో నిరూపించుకోవటం కోసం ఈ నాటకం అంతా ఆడాను. మంచి అని తెల్సినా, పిరికి తనంతో అలా ప్రవర్తించాను. ఆత్మ సంతృప్తి కోసంకాక, పదుగురి నోటి మాటల కోసం బ్రతికాను. నన్ను శాసించే



అధికారాన్ని, నా పిరికితనంతో పదుగురికీ ధారా దత్తం చేశాను. వాళ్ళందరి కోసం రామాన్ని వదులుకున్నాను. పది మందీ రామాన్ని తన ముందే తిడ్తుంటే నోరు మూసుకుని కూర్చుని, వాడిని ఈ పోరాటంలో ఒంటరిగా వదిలేశాను. పది రోజుల్లో అందరూ ఈ విషయం మర్చిపోయారు. ఎందుకంటే, లోకులకి ప్రపంచంలోని ప్రతి విషయం కావాలి. ఏది కొత్తగా కన్పిస్తే, దాంట్లో తల దూర్చుతారు. అలాంటి పని లేని వాళ్ళ కోసం. నేను మాత్రం రామం విషయాన్ని మర్చిపోలేదు. వాడిని క్షమించ లేదు. అయినా, ఇప్పుడనిపిస్తుంది. క్షమించడానికి వాడేమి తప్పు చేశాడు గనుక? తన జీవిత భాగస్వామిని ఎన్నుకోవటమేనా వాడు చేసిన తప్పు?

ఆ తరువాత మూడు సంవత్సరాలు, వాడితో నేను మాట్లాడలేదు. వాడు మాత్రం అప్పుడప్పుడూ ఇంటికి వస్తూనే వున్నాడు. వాళ్ళ అమ్మతో మాట్లాడుతున్నాడు. నన్ను మాట్లాడించడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు వాడు. తండ్రినై నందుకు నేను వాడికి చేసిన అవమానాన్ని దిగమింగాడు. చుట్టుపక్కల వాళ్ళు నేను ఎంత పట్టుదల కల మనిషినో అని 'కీర్తించడం' విని సంతృప్తి చెందాను. లోలోపల గర్వపడ్డాను. సంఘటనలన్నింటికీ పరాకాష్ఠ రెండు సంవత్సరాల క్రితం జరిగింది. నన్ను ఇన్ని సంవత్సరాలు అంటి పెట్టుకుని, నాకు తోడుగా, నీడగా నిల్చిన నా భార్య మరణించింది. ఆకస్మాత్తుగా నేను ఈ విశాల ప్రపంచంలో ఒంటరి వాడినయ్యాను. ఆమె మరణం నన్ను విపరీతంగా క్రుంగ దీసింది. రామంకి వాళ్ళ అమ్మంటే పంచ ప్రాణాలు. ఎవ్వరో వాడికి కబురు పంపారు. కనీసం అది కూడా నేను చెయ్యలేదు. ఊరి నుండి వచ్చిన వాడిని ఓదార్చటం ఎవ్వరి తరం కాలేదు. గుండెలు పగిలిపోతాయేమో అన్నంతగా రోదించాడు.

ఇన్ని సంవత్సరాల తరువాత రామం నాకు చాలా అప్పుడిలా కన్పించాడు. వాడి దగ్గరికి వెళ్ళి, వాడిని నా గుండెలకు హత్తుకొని ఓదార్చాలన్న నా ఆలోచనను నాలోనే అణగదొక్కుకున్నాను. వాడిని ఓదార్చ గలవాడిని నేను ఒక్కడినే అన్న విషయం నాకు తెలుసు. కానీ, ఇన్ని సంవత్సరాలుగా నేను యజ్ఞంలా నిర్వహిస్తున్న పట్టుదల భగ్నమయి పోతుంది. బంధువులు, స్నేహితులు, ఇరుగు పొరుగు మధ్య నేను నా ఓటమిని ఒప్పుకున్నట్లవుతుంది. బింకంగా ఉండిపోయాను. నేను మన సంప్రదాయాలకు, ఆచారాలకు ఇచ్చిన విలువలకు అందరూ ఇది పరాకాష్ఠగా భావిస్తారని తలిచాను. రామం ఏమనుకున్నాడో నాకు తెలియదు. నన్ను అసహ్యించుకుని వుంటాడు. ఈ రెండు సంవత్సరాలూ వాడు మా ఇంటికి రాలేదు. ఎందుకని వస్తాడు? నేనువాడిని కాదనుకున్నాను. వాడికీ, ఈ ఇంటికీ ఉన్న ఒకే ఒక బంధం వాళ్ళమ్మ లేదు.

ఈ జీవిత సాయంసమయంలో ఒంటరిగా వుండి ఆలోచించుకుంటే నాకు ఏమి మిగిలింది? భవిష్యత్తు లేదు. మృత్యువు కోసం ఎదురు చూడటం తప్ప. వర్తమానం లేదు. ఒంటరి తనం తప్ప. వెనక్కి తిరిగి చూసుకుంటే ఏం వుంది? నాకు ఎవ్వరూ లేరు. నాకు ఏమీ మిగల లేదు. నేను ప్రపంచం కోసం మిధ్యా ప్రతిష్ఠ కోసం ఏం సాధించుకున్నాను? నేను ఎవ్వరి కోసం బ్రతికానో వాళ్ళు నాకు ఈ రోజున ఏమి ఇచ్చారు? నేను నా కొడుకుని వదులుకున్నాను. వాడు జీవితంలో సాధించిన విజయాలను వీక్షించకుండా వాడిని దూరం చేసుకున్నాను. వాడి అనురాగాన్ని కోల్పోయాను. నా మనవళ్ళతో ఆటలను వదులుకున్నాను. వాళ్ల ముద్దులను వదులుకున్నాను. వాళ్ళు చదువుకొని ముందు ముందుకు వస్తుంటే, చూస్తూ గర్వంగా పొంగి పోవాల్సిన క్షణాలను జార విడుచుకున్నాను. దానికి బదులుగా నేను ఏం సాధించాను? ఇప్పుడు కూర్చుని ఆలోచిస్తే శూన్యం. నేను పోగొట్టుకున్న దానికి నేను బాధ్యుడిని కానీ, ఏ తప్పు చేయకుండానే నా భార్య, నా కొడుకూ శిక్ష అనుభవించారు. వాళ్ళని ఎడ దీశాను. పరస్పర ప్రేమకు దూరం చేశాను. నా మూర్ఖత్వం కారణంగా వాళ్ళు బాధపడ్డారు. లోకంలో లేని నా భార్యకు ఇక నేనేమీ చేయలేను. కానీ రామంకి కనీసం క్షమాపణ చెప్పాలి. వాడి ముందు నా తప్పును మన స్ఫూర్తిగా ఒప్పుకోవాలి. వాడు తన తప్పుకు ఏ శిక్ష విధించినా భరించాలి. అప్పుడు కానీ మనశ్శాంతి రాదు. వాడు నన్ను క్షమిస్తాడన్న నమ్మకం లేదు. వాడు నన్ను ఎంతగా తిడితే నాకు అంత సంతృప్తి లభిస్తుంది. అలా అయితే తప్ప నా తప్పుకి తగిన శిక్ష లభించదు.

నేను ఈ ముసలితనంలో ఒంటరి తనం భరించలేకనో, లేక ప్రేమరాహిత్యం కారణంగానో ఇలా ప్రవర్తించడంలేదు. కేవలం నా తప్పును నేను మనస్ఫూర్తిగా ఒప్పుకోవడం కోసమే ఇలా చేస్తున్నాను. ఇప్పటి నా ఈ ప్రయాణం దానికోసమే. ఆలోచనలో నుండి బయటకు వచ్చేసరికి నేను దిగాల్సిన స్టేషను వచ్చేసింది. రామం అడ్రస్ వెతుక్కుంటూ వాడింటికి బయలుదేరాను.

ఇప్పుడు నన్ను చూసి రామం ఏమనుకుంటాడు? ఇల్లు తేలికగానే దొరికింది. సమయం సాయంత్రం ఆరు గంటలవుతోంది. బయట ఎవ్వరూ లేరు. 'వి.

## పగిలిన అద్దంలో

అద్దం పగిలిపోతుంది
ప్రతిబింబం పగుళ్ళలో
జీవనస్పర్శని కోల్పోతావు
అనుభూతి సిగ్గెరుగదన్న సొగసైన మాట
ఆకలి సిగ్గెరుగదన్న నిజాయితీగా
నీలో నిర్వచనమవుతుంది
కవితాత్మ నిట్ల భావమయేంతలో
ఒకానొక రాస్తాలో
వెన్నెల నీడలతో కొలుస్తూ వెళ్ళే జీవితం మీద
ఊడల మఱ్ఱి వికృతంగా చీకటి పరుస్తుంది
సమయం మనది కాని వేళ
అందమైన సాయంకాలం
అమృతా షెరిగిల్ బొమ్మలా కనిపించదు -
ఆత్మని ఊయలలూపే మురళీగానం సైతం
అగాథాల్లోంచి పైకి లేవదు
వెదురు వేణువూ కాదు ఎంత వూపిరి పోసినా
మాట సరే అదో అర్థంగాని ప్రహసనం...
స్పర్శ చచ్చుబడిపోతుంది
పరిస్థితి పరాకాష్టకు చేరుకుంది
ఎడదలో ఎడారి మొక్కలు ఏపుగా పెరుగుతున్న
ఈ వేళగానివేళ
నేనంటే నేను మాత్రమే కాదురా నాన్నా!
నేను నేనుగా ఇమడలేకా,
మరో పాత్రగా రూపం చెందిన
ప్రతిబింబాన్ని!

— శివలెంక రాజేశ్వరీదేవి

రామమూర్తి' నేమ్ బోర్డు మెరుస్తూ కనిపిస్తుంది. ప్రేమగా ఆ పేరును నిమిరాను. ఇన్ని సంవత్సరాలు నా ఈ ప్రేమను ఎలా అణచివేయగలిగాను? హాల్లో కూడా ఎవ్వరూ లేరు. జంకుగా లోపలకు అడుగు పెట్టాను. ఇదేమిటి నేను ఇంత భయపడ్తున్నాను? మా అబ్బాయి ఇంట్లోకి రావడానికి నాకు భయమా? వాడిని నేను నిన్నటి వరకూ ఏమీ కాదనుకున్న మాట వాస్తవమే. కానీ, ఈ రోజు వాడు నాకు నా రక్తం పంచుకుని పుట్టినవాడు. అయినా, నా కోడలు, నా మనవలు నన్ను ఎలా చూస్తారు? ఆలోచిస్తూ హాల్ లో నిలబడిపోయాను. ఎవరినన్నా పిలవాలి — ఎలా? రామం అని పిలవాలా? ఒరేయ్ అని పిలవాలా? ఏమండీ అని పిలవాలా? నా ఆలోచనలు నాకే సిగ్గు తెప్పిస్తున్నాయి. ఒక్క క్షణం వెళ్లిపోదామనుకున్న కోరికను కష్టపడి అణచుకున్నాను. పిలుద్దామను కున్నంతలో హాలుని ఆనుకుని వున్న గదిలోనుండి హెచ్చు స్థాయిలో మాటలు వినిపించాయి.

"నువ్వు నా ఇష్టప్రకారమే చేయాలి. నేను నా స్నేహితుడికి మాట ఇచ్చాను. వాళ్ల అమ్మాయితో నీ పెళ్ళి జరిపిస్తానని. నువ్వు ఇప్పుడు అర్ధాంతరంగా వేరే ఎవ్వరో అమ్మాయిని పెళ్లి చేసుకుంటానంటే నా మాటేమి కావాలి? నేను వాడి ముందు ఎలా తల ఎత్తుకోగలను?" అది నిశ్చయంగా రామం గొంతు.

"నాన్నగారూ! మీరు ఎవ్వరికి మాట ఇచ్చారో నాకు అనవసరం. నేను గిరిజను ప్రేమించాను. ఆమెకేం తక్కువ? చక్కగా చదువుకుంది, అందంగా వుంటుంది. చాలా మంచిది. నేను ఆ అమ్మాయిని తప్ప వేరెవర్నీ పెళ్లి చేసుకోను" బహుశా రామం కొడుకు గొంతు అయి వుంటుంది.

నేనేమిటి ఇటువంటి సమయంలో వచ్చాను?

"ఆ పెళ్లి ఎటువంటి పరిస్థితిలోనూ జరగదు, జరగదు, జరగదు. నేను నిర్ణయించిన అమ్మాయితోనే నీ వివాహం జరుగుతుంది. నా ఇష్టానికి విరుద్ధంగా జరగడాన్ని నేను సహించను" రామం గొంతు కఠినంగా.

"ఏం ఎందుకు జరగదూ? నువ్వు మీ నాన్నకి ఇష్టం లేకుండా అమ్మని పెళ్లి చేసుకోలేదా?"

రామంకి పిచ్చి కోపం వచ్చింది.

"ఓహో! నన్ను ప్రశ్నించే స్థాయికి ఎదిగి పోయావన్న మాట. నేను మా నాన్నకి ఎదురు తిరిగినందుకు ఆయన ఏంచేశాడో తెలుసా? నన్ను ఇంట్లోనుండి తరిమి తగలేశాడు. నాతో పూర్తిగా తెగ తెంపులుచేసుకున్నాడు. నువ్వు ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటే ఈ ఇంట్లో వుండడానికి వీల్లేదు."

రామం విసురుగా హాల్లోకి వచ్చేశాడు. ఎదురుగా నేను! రామం నిశ్చేష్టుడైపోయాడు. ఒకరి కళ్లలోకి ఒకరం చూస్తూ వుండిపోయాం. రామంకి ఇది కలో, నిజమో అర్థమయివుండదు. ఇరవై మూడు సంవత్సరాల తరువాత నా అంతట నేను తన ఇంటికి వస్తానని కలలో కూడా అనుకుని వుండడు.

"ఎప్పుడు,ఎప్పుడు వచ్చారు నాన్నగారూ అని నేను సమాధానం చెప్పకముందే 'కూర్చోండి' అన్నాడు. ఇద్దరం ఎదురుఎదురుగా అలా కూర్చుండి పోయాం. నేను ఇక్కడికి ఎన్నో చెప్పాలని వచ్చాను. కానీ, తీరా వచ్చాక నోరు పెగలడంలేదు. మనవళ్లిద్దరూ వచ్చి ఓ మూల నిలబడి విచిత్రం చూస్తున్నారు. కోడలు "స్నానం చేద్దురుగానీ, రండి మావయ్యా!" అంది. స్నానం, భోజనం అయ్యాయి. నేను ఏమీ మాట్లాడలేదు. రామంకూడా మౌనంగానే వున్నాడు. హాలులో పక్క వేశారు. నేను పడుకుంటే రామం వచ్చి ప్రక్కన కుర్చీలో కూర్చున్నాడు. రామం మొహంలో ప్రశ్నార్థకం కనిపిస్తోంది. "రామం నేను ఇక్కడికి ఎందుకు వచ్చానో తెలుసా? ఇరవై మూడు సంవత్సరాలుగా నేను నీకు చేసిన అన్యాయానికి, నిన్ను క్షమాపణ అడగడం కోసం వచ్చాను. ఇంతకాలంగా నిన్ను ఒంటరిగా వదిలేసి నందుకూ నిన్ను నీ అమ్మకు దూరం చేసినందుకూ క్షమాపణ కోరడంకోసం వచ్చాను. నిన్ను చూసిన తర్వాత ఇప్పుడనిపిస్తోంది, నా మొదటి తప్పుతో పాటు, నా నడివయస్సు తప్పుకూడా వుందని. యువకుల ముందు భవిష్యత్తు ఎంతో వుంటుంది. వాళ్ళు వాళ్ల గురించి అందుకనే ఆశావాదంతో వుంటారు. ముసలి వాళ్లకు ముందు ఏం వుండదు. వాళ్ల గురించి వాళ్లు ఆలోచించడానికి ఏం వుండదు. వాళ్ళు మిగతా వాళ్ల గురించి మంచిగానే ఆలోచిస్తారు. కానీ, నడి వయస్సులో వుంటారు చూశావా? వాళ్ళు వాళ్ల గురించి పాజిటివ్‌గానూ, ఎదుటి వాళ్లనుగురించి నెగెటివ్‌గానూ ఆలోచిస్తారు. తమకు అంతా తెలుసనీ, మిగతావాళ్లకు ఏం తెలియదనీ అనుకుంటారు. కేవలం తన నిర్ణయాలే పిల్లల భవిష్యత్తును సజావుగా సాగిపోయేలా తీర్చిదిద్దగలవని గాఢంగా నమ్ముతారు. అందరూ అలాగే వుంటారని చెప్పను కానీ, ఎక్కువ శాతం అలాగే ప్రవర్తిస్తారు. నేనూ, నీ పట్ల అలాగే ప్రవర్తించాను. నిన్ను ఇంత కాలంగా బాధపెట్టాను. కానీ, ఇప్పుడు ఈ ఆఖరు క్షణంలో ఆ విషయాన్ని గుర్తించినా నీక్కలిగిన కష్టనష్టాలను తీర్చగల్నా? ఇరవై మూడు సంవత్సరాలుగా నువు పోగొట్టుకున్న ప్రేమనూ, ఆప్యాయతనూ నువ్వు పడిన వేదననూ అనుభవించిన ఒంటరి తనాన్నినేనెలా పోగొట్టగలను? నీ భార్య, పిల్లలు నీతో వుండి వుండవచ్చు. కానీ, నీ అమ్మా, నాన్న లేని లోటును వాళ్ళు ఎలా తీర్చగలరు? నేను చేసిన తప్పుకు నువ్వు నన్ను క్షమించినా, ఈ ప్రశ్నలు నన్ను జీవితాంతం వేధిస్తాయి. ఇదంతా నేను నీకు ఎందుకు చెప్తున్నానంటే నేను చేసిన తప్పు నువ్వు చేయకూడదనే. మళ్లీ ఓ ఇరవై సంవత్సరాల తర్వాత నువ్వు నీ అబ్బాయిని క్షమాపణ కోరుకో కూడదనే. వివాహమనేది ఎవ్వరికి వారుగా తీసుకోవాల్సిన నిర్ణయం. దానివల్ల కలిగే లాభనష్టాలు వారే అనుభవిస్తారు కనుక వారే నిర్ణయం తీసుకోవడం ఉచితం. దయచేసి, నా ఈ సలహాను పాటించు.

ఏమనుకున్నాడో రామం. అక్కడినుంచి లేచి వెళ్లి పోయాడు. నేను అన్నాను "రేపు ఉదయం బండికి నేను వెళ్తున్నాను" ఏం మాట్లాడకుండానే రామం గదిలోకి వెళ్లిపోయాడు.

తెల్లవారింది. నేను స్టేషనుకు బయలు దేరుతుంటే నాతోపాటు రామం బయలుదేరాడు. నాకు చాలా ఆనందం వేసింది. స్టేషన్ చేరుకున్నాం. నేను రైలులో కూర్చుంటే రామం బయట ప్లాట్‌ఫామ్‌పై నిలబడ్డాడు. బండి బయలుదేర బోతుంటే రామం నాతో చెప్పాడు.

"నేను వాడి ఇష్టప్రకారమే చేయాలని నిర్ణయించు కున్నాను. పెళ్లికి తేదీ నిర్ణయించగానే మీ దగ్గరకు వస్తాను మీరే దగ్గరుండి ఈ శుభకార్యం జరిపించాలి"

బండి కదిలింది.

రామం నన్ను క్షమించాడు.